


# వ్యాఖ్యానం

'జుగాష్విలి'

ఆమె నడుస్తుంది

అతడు నడుస్తున్నాడు

ఇద్దరూ నడుస్తున్నారు

ఇద్దరూ కలిసి నడవడం లేదు

ఒకరు ముందు మరొకరు వెనుక నడుస్తున్నారు.

సాయంత్రం ఆరు గంటలు

కార్తీకమాసపు చలి రోజులు

అప్పుడే వీధి దీపాలు వెలిగాయి.

అప్పుడే స్టేషన్‌లోకి రైలు వచ్చినట్లుంది. జనం ఒకరినొకరు నెట్టుకుంటూ వస్తున్నారు.

**ఆమె కడుపులో ఆకలి వుంది**
**ఆమె ఒంట్లో నీరసం వుంది**
**ఆమె మనస్సులో ఆశ వుంది**

అతడు కూడా ఆ గుంపును నెట్టుకుంటూ బయటికొచ్చాడు.

అతడు పల్లెటూరి వాడిలా వున్నాడు. అతడి వయస్సు ఇరవై ఆరుకు మించి వుండదు. అతడు నీరుకాయ పంచె కట్టుకున్నాడు. పొట్టి చేతుల చొక్కా వేసుకున్నాడు. అతడి చేతిలో కాకి రంగు సంచి వుంది. ఆ సంచి సగానికి మడచి పట్టుకున్నాడు. అతడు గుంపును చీల్చుకొని బయటపడి నాలుగు వైపుల ఒకసారి చూచి త్వర త్వరగా నడుస్తున్నాడు.

అదుగో ... ఆమె అప్పుడే చూచింది అతడిని.

అతడి వెనకాలే నడవడం మొదలెట్టింది.

ఆమె తలలో మల్లెలున్నాయి

ఆమె పెదవిపై నవ్వులున్నాయి

ఆమె కడుపులో ఆకలి వుంది.

ఆమె ఒంట్లో నీరసం వుంది

ఆమె మనస్సులో ఆశ వుంది

అతడు వీధి మలుపు తిరిగాడు. వీధి దీపం దాటాడు. అతని పాదాల క్రింద పడుతున్న నీడల్ని గమనించి వెనక్కి తిరిగి ఆమెకేసి చూచాడు. ఆ చూపులో కోర్కె లీలగా కదిలింది. లేదా ఆమెకు అలా కనిపించింది.

ఆమె గుండెలో ఆశ

ఆమె గొంతులో ఆశ

ఆమె చూపులో ఆశ

ఆమె చిరునవ్వులో ఆశ

ఆమె త్వరగా నడచి అతడిని కలుసుకుంది.

"మా యిల్లు యిక్కడేనండీ" అందామె.

అతడు ఆగి ఆమె వైపు మరోసారి చూచాడు.

ఆమె నవ్వింది.

ఆ నవ్వులో ఆశ - ఆ చూపులో ఆశ.

"మా యిల్లు చాల దూరమండీ" - అని అతడు త్వరగా అడుగులేస్తూ వెళ్ళిపోయాడు.

ఆమె ఆగిపోయింది నిరాశగా.

ఆ క్షణం...

ఆమె గుండె నిట్టూర్పులో - జీరాడిన గొంతులో-ఆమె కార్చిన కన్నీటి చుక్కలో నిరాశ. అతడు వెళ్ళిపోతూ యిలా అనుకున్నాడు.

"నేనొక పల్లెటూరి వెధవననుకుంది. ఆమెలాంటి పతితులు - భ్రష్టులు - దగా పడిన తమ్ముళ్ళ జీవితాలు బాగుపరచడానికి జరిగే ప్రయత్నంలో నా పాత్ర వుందని ఆమెకేమి తెలుసు? ఏది ఏమైనప్పటికి ఈ వ్యవస్థ ప్రసాదించిన విశృంఖలత్వం నాలో లేదుగదా! ఆమెను నేనెంత గౌరవించాను. నా నైతిక విలువల్ని ఎంతగా కాపాడుకున్నాను. నేనెంత మంచి వాడిని."

ఈ సంఘటన గురించి విన్న సమాజం యిలా అంటుంది.

"చేతగానివాడు"

ఆమె ఆ వీధి దీపం వెలుతురులో నిల్చొని వెళ్ళిపోతున్న అతడివైపు చూస్తూ యిలా అనుకుంది.

"ఈ బేరమన్నా కుదురుతుందని ఆశ పడ్డాను. రెండు రోజుల నుండి కాలుతున్న ఈ కడుపుకు ఈ పూటైనా యిన్ని మెతుకులు పడేద్దామనుకున్నాను. ఆ ఆశా పోయింది. *

ప్రతివారం ప్రజాతంత్ర చదవండి

ప్రతిసారీ మనిషిగా

ఎదగండి